
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

మంగళవారం 27 ఆగస్టు 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 26.0
తణుకు : 34.0 - 26.0

ప్రభుత్వాసుపత్రి పూర్తయ్యేనా ?

కుళాయిల్లో మురుగునీరు -7లో

స.హ.చట్టం

బెదిరింపుల చుట్టం!



- అధికారుల అక్రమాలపై వివరాల సేకరణకు ముఠా
- సమాచారం అడగ్గానే.. వారితో రాయబేరాలు
- అడిగినంత సొమ్ములు ఇచ్చి గప్‌చుప్
- కొంత కాలానికి మళ్లీ చెలరేగిపోతున్నారు
- కొన్నిచోట్ల సమాచారం ఇచ్చేందుకు అధికారుల నిరాకరణ.. నిర్వీర్యమవుతున్న చట్టం

తాడేపల్లిగూడెం మండలంలోని పలు పంచాయతీల జమా ఖర్చుల వివరాలు తెలపాలని ఓ దళారి కార్యదర్శులకు దరఖాస్తు చేశాడు. ఆ సమాచారం ఇవ్వడం ఇష్టం లేకో, సమాచారం ఇస్తే తమ తప్పులు ఎక్కడ బయట పడతాయనో తెలియదు కానీ ఆ సమాచారం ఇవ్వకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు ఆ దళారితో బేరం పెట్టుకుని కొంత ముట్టజెప్పి కథ సుఖాంతం అయిందనుకున్నారు. కానీ అక్కడే మొదలైంది అసలు కథ. ఆ దళారి తన స్నేహితులతో అదే పనిగా స.హ. చట్టం ద్వారా దరఖాస్తు చేయించడం ఆ అధికారుల వద్ద వచ్చిన కాడికి దండుకోవడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారం ఎంతవరకూ వెళ్లిందంటే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పంచాయతీలే లక్ష్యంగా ఆ స్నేహితుల బృందం (ముఠా) ఇదే తరహాలో మాఫియాలా మారింది. ఇప్పుడు ఆ అధికారులు వారికి పెట్టిన పేరే స.హ.చట్టం ముఠా.

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 26 : సమాచార హక్కు చట్టానికి తూట్లు పడుతున్నాయి. పౌరుడు ఏదైనా ప్రభుత్వ శాఖలో అవినీతి జరిగిందని తెలుసుకోవడానికి, తనకు కావాల్సిన సమాచారం అధికారుల నుంచి పొందేందుకు చట్టపరంగా అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. మరి కొందరు అధికారులు చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా ప్రభుత్వ శాఖల్లో సమాచారం ప్రతీ పౌరుడు తెలుసుకోవాలని ఏర్పాటు చేసిన చట్టం ఆచరణలో నిర్వీర్యమవుతోంది. దీనికి నిత్యం ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

చెప్పేందుకు నిరాకరణ

తాడేపల్లిగూడెం మండలంలోని ఒక ఆలయంలో ఉత్సవాలకు అధిక మొత్తంలో ఖర్చు చేశారని ఆరోపణలు రావడంతో దీనికి సంబంధించిన ఖర్చుల వివరాలు తెలియజేయాలని ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా దేవదాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేశాడు. దాతల వివరాలు తెలిపేందుకు సమాచార హక్కు చట్టంలో వెసులుబాటు ఉంది. అయితే ఇది తమ శాఖ పరిధిలోకి రాదని సంబంధిత అధికారి బదులు ఇచ్చి, చేతులు దులుపుకున్నారు. స.హ. చట్టం ద్వారా తనకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకునేందుకు పౌరుడు తన ఆధార్ కార్డు ద్వారా సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకుంటే 28 రోజుల్లోగా సమాచారం అందించాలి. అక్కడ సమాచారం ఇవ్వకపోతే జిల్లా సమాచార అధికారిని సంప్రదించాలి. ఇక్కడా పరిష్కారం దొరక్కపోతే రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి. దీనిపై ఇక్కడ విచారణ జరిపి సంబంధిత అధికారికి జరిమానా విధిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి జరిమానాలు ఒక్కటి కూడా కనిపించలేదు. ఆలస్యమైన ఒక్కో రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించాలి. అప్పీలుకు వెళితే 30 రోజుల్లో పరిశీలనకు రావాల్సి ఉండగా నెలలు గడుస్తున్నా అలాంటి విచారణలే లేవు.

వివరాలు అడిగితే బెదిరింపులు

గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి జరిగిందని ఓ పౌరుడు స.హ.చట్టం ద్వారా వివరాలు అడిగాడు. అయితే సంబంధిత అధికారి ఈ సమాచారాన్ని వైసీపీ నేతకు ఇచ్చాడు. దీంతో సదరు నేత ఆ వ్యక్తిని ఫోన్‌లో బెదిరించడంతో ఆ పౌరుడు ఈ విషయంలో సైలెంట్ అయ్యాడు. ఈ తరహా ఘటనలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో చాలానే చోటు చేసుకున్నాయి.

జయ కృష్ణా.. ముకుందా.. మురారి



పెంటపాడు మండలం కె.పెంటపాడు బైరాగిమఠంలో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



ఉట్టి కొట్టిన చిన్నారి శ్రీకృష్ణుడు

సిఫార్సు వుందా.. ఐతే ఓకే

ఉద్యోగుల బదిలీల్లో ఇదే కీలకం

పంచాయతీరాజ్‌లో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ.. జడ్పీలో నేటితో ముగింపు

ఏలూరు సిటీ, ఆగస్టు 26: పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి పంచాయతీ, జడ్పీ, జడ్పీ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉద్యోగుల బదిలీలను ఆయా శాఖల ఉన్నతాధికారులు నిర్వహిస్తున్నారు. ఒకేచోట ఐదేళ్లు పనిచేస్తున్న వారితోపాటు మిగిలిన వారు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. జీరో సర్వీస్ నిబంధన ఏర్పాటు చేయడంతో పంచాయతీరాజ్ శాఖలోని వివిధ విభాగాల ఉద్యోగులందరికీ బదిలీ అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అందువల్లే వారు కూడా తమకు నచ్చిన ప్రాంతానికి బదిలీ కావాలని దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత ఐదేళ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న వారు తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీలు కావాలని కోరుకుంటున్నారు. గతంతో పోలిస్తే అధిక సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. ఈ బదిలీల ప్రక్రియలో ఎమ్మెల్యేలు, ఎంపీలు సిఫార్సు పత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలతో సన్నిహితంగా వున్న రాజకీయ నాయకులను కలిసి ఈ లేఖలను తీసుకుని మరీ దరఖాస్తులు చేస్తున్నారు.

నేటితో జడ్పీ దరఖాస్తుల ముగింపు

జడ్పీ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే ఈ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ముగియగా, ఈ జిల్లాలో ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియకు సంబంధించి ఈ నెల 27వ తేదీతో దరఖాస్తుల గడువు ముగియనుంది. ఉమ్మడి పశ్చిమలో జడ్పీకి సంబంధించి 48 మండలాలు, 238 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు (హైస్కూళ్లు), జిల్లా పరిషత్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్యాలయం ఉన్నాయి. జడ్పీ, మండల పరిషత్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి ఎంపీడీవోలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్స్, మినిస్టీరియల్ సిబ్బంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఈ ఉమ్మడి పశ్చిమ నుంచి ఇతర జిల్లాలకు బదిలీ కోసం 10 మంది ఎంపీడీవోలు దరఖాస్తు చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాలలకు సంబంధించి నాన్ టీచింగ్ స్టాఫ్ అయిన రికార్డ్ అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సారి దరఖాస్తులు అత్యధిక సంఖ్యలోనే వచ్చాయి. దరఖాస్తుకు గడువు ముగిసిన వెంటనే పరిశీలించి, బదిలీల ప్రక్రియ నిర్వహిస్తామని జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు.

పంచాయతీలకు ముగిసిన గడువు

పంచాయతీలకు సంబంధించి ఈ నెల 24తో దరఖాస్తుల గడువు ముగిసింది. అత్యధిక సంఖ్యలో కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి పశ్చిమలో 910 పంచాయతీలు, నాలుగు డీఎల్‌పీవో కార్యాలయాలు ఉన్నాయి. గ్రేడ్-1 నుంచి గ్రేడ్ 6 వరకు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఎల్‌పీవో కార్యాలయాల్లో పనిచేసే ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, స్వీపర్, అటెండర్లు బదిలీలు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉండే ఈవోపీఆర్డీలు దరఖాస్తు చేశారు. పంచాయతీల్లో 406 మంది బదిలీలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో వివిధ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆశీస్సులతో



పనిచేసే ఉద్యోగులకు ఈసారి బదిలీలు తప్పనిసరిగా జరగనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా మెలిగిన వారికీ బదిలీలు తప్పవని తెలుస్తోంది. ఒకవేళ సాధారణ బదిలీల్లో వారికి అవకాశం లేకపోతే అడ్మినిస్ట్రేటివ్ నిబంధనల ప్రకారం వారిని బదిలీ చేసే అవకాశాలున్నాయి. దరఖాస్తుల గడువు ఈ నెల 24తో ముగిసిందని, రెండు నుంచి మూడు రోజులు దరఖాస్తుల పరిశీలన, 29, 30వ తేదీల్లో డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల, 31న తుది బదిలీల జాబితా విడుదల అవుతుందని డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు.

డీలర్లు.. డీలా



2019కు ముందుకు రైతులకు రాయితీపై ట్రాక్టర్ల సరఫరా

- వైసీపీ ప్రభుత్వం రాకతో.. డీలర్లకు చెల్లించని బకాయిలు
- మూతపడిన ట్రాక్టర్ ఏజన్సీలు.. రోడ్డున పడ్డ డీలర్లు
- కూటమి ప్రభుత్వం రాకతో సొమ్ముల చెల్లింపుపై దృష్టి

జిల్లాలో రూ.12 కోట్ల మేర బకాయిలు చెల్లించాలి. వైసీపీ ప్రభుత్వం ఆ మొత్తాన్ని విడుదల చేయాలి. ఉద్దేశ పూర్వకంగానే ఇవ్వలేదు. చివరకు కొందరు డీలర్లు అప్పులు చేసి కంపెనీలకు సొమ్ములు చెల్లించారు. లేని వారు తమ ఏజన్సీని వదులుకున్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కంపెనీల వద్ద పరపతిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వైసీపీ హయాంలో రైతులకు రాయితీ పరికరాలు ఇవ్వడానికి కంపెనీలు నిరాకరించాయి. ముందుగా సొమ్ములు చెల్లించాలని పట్టుబట్టాయి. దీనివల్ల రెండేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం రైతులకు రాయితీ పరికరాలు ఇవ్వలేకపోయింది. సొమ్ములు చెల్లించిన తర్వాత కంపెనీలు పరికరాలు మంజూరు చేశాయి. ప్రభుత్వ ప్రతిష్ఠ అంతగా దిగజారిపోయింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

తాడేపల్లిగూడెంలో ఓ ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్‌కు ప్రభుత్వం రూ.2 కోట్లు బకాయి పడింది. రైతు రథంలో భాగంగా అన్నదాతకు రాయితీతో ట్రాక్టర్లు పంపిణీ చేశారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు 2019 ఎన్నికల ముందు ప్రతి నియోజకవర్గానికి 50 చొప్పున రైతులకు ట్రాక్టర్లు సరఫరా చేశారు. ప్రతి ట్రాక్టర్‌పైనా రూ.2 లక్షలు రాయితీ ప్రకటించారు. డీలర్లు పోటీపడి ట్రాక్టర్లు అందజేశారు. ప్రభుత్వం రాయితీ ఇవ్వలేదు. వైసీపీ హయాంలో రైతు రథం పథకాన్ని నిలిపివేశారు. టీడీపీ హయాంలో ట్రాక్టర్ ఇచ్చారన్న నెపంతో రాయితీ సొమ్ములు ఇవ్వలేదు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్కపైసా కూడా విడుదల చేయలేదు. దీంతో డీలర్లపై కంపెనీలు ఒత్తిడి తెచ్చాయి. రాయితీ సొమ్ము బకాయిలను కంపెనీకి చెల్లించాలని ఒత్తిడి చేశారు. ప్రభుత్వం సొమ్ములు విడుదల చేయలేదని చెప్పినా వినలేదు. వడ్డీతో సహా కట్టాలని హుకుం జారీచేశారు. లేదంటే డీలర్ షిప్‌ను తొలగిస్తామని స్పష్టం చేశారు. సదరు డీలర్ సొమ్ములు చెల్లించలేకపోయారు. దీంతో తాడేపల్లిగూడెం షోరూమ్ బాధ్యతలను మరో డీలర్‌కు అప్పగించారు. దశాబ్దాలుగా డీలర్ షిప్‌ను నమ్ముకుని వ్యాపారాలు చేసిన తాడేపల్లిగూడెం డీలర్ కేవలం ప్రభుత్వ తప్పిదం వల్ల పరపతి కోల్పోవలసి వచ్చింది. సదరు షోరూమ్ స్థలాన్ని అమ్మకానికి పెట్టేశారు. వైసీపీ ప్రభుత్వం కక్ష పూరిత చర్యలకు ఇలా ఎంతో మంది డీలర్లు బలయ్యారు. తాడేపల్లిగూడెంలోనే మూడు కంపెనీల డీలర్లు నష్టాల్లో కూరుకుపోయి.. చావు దెబ్బ తిన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టకు మచ్చ

తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో అధికారంలో ఉన్నప్పుడు పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాకు రైతు రథం పథకంలో రైతులకు 900 ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల రాయితీని ప్రకటించింది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా ఇచ్చాయి. బ్యాంకుల ద్వారా పొందిన రుణ మొత్తాన్ని రైతుల నుంచి డీలర్ల ఖాతాలకు మళ్లించారు. అయితే రాయితీ సొమ్మును విడుదల చేయలేదు. బ్యాంకు రుణాలనే డీలర్లు కంపెనీలకు చెల్లించారు. ప్రభుత్వం రాయితీ విడుదల చేస్తే మిగిలిన మొత్తాన్ని కంపెనీలకు చెల్లిస్తామంటూ డీలర్లు భావించారు. కంపెనీలు తొలి రోజుల్లో పెద్దగా ఒత్తిడి చేయలేదు. చివరకు వైసీపీ ప్రభుత్వం రాయితీ విడుదల చేయదన్న భావనకు వచ్చేసిన కంపెనీలు డీలర్లపై ఒత్తిడి చేశాయి. సొమ్ములు చెల్లించాలని పట్టుబట్టాయి.

బకాయిలపై కూటమి దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలపై దృష్టి పెట్టింది. రైతులకు చెందిన బకాయిలన్నింటినీ విడుదల చేస్తూ వస్తోంది. ధాన్యం బకాయిలను చెల్లించింది. తాజాగా రైతురథంలో రాయితీలను విడుదల చేస్తోంది. జిల్లాలో బకాయిలను డీలర్లకు జమ చేస్తుండడంతో కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇప్పటికే కాలాతీతం కావడంతో రోడ్డున పడ్డారు. ఇతర వ్యాపారాల్లోకి వెళ్లిపోయారు. సిబ్బందిని తొలగించేశారు. కేవలం వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదానికి ట్రాక్టర్ ఏజన్సీలు దెబ్బతిన్నాయి. కంపెనీల వద్ద పరపతి పెంచుకునేలా ఇప్పుడు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. బకాయిలను చెల్లిస్తోంది. మున్ముందు రైతులకు వ్యక్తిగత రాయితీలతో కూడిన పరికరాలను అందజేయడానికి కసరత్తు చేస్తోంది. వైసీపీ హయాంలో దీనిని ఎగ్గొట్టారు. కేవలం మండలంలో ఐదు మంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూర్చే రాయితీని గత ఐదేళ్లలో అమలు చేశారు. తాజాగా అత్యధిక మంది రైతులకు లబ్ధిచేకూర్చే రాయితీ పథకాలపై కూటమి కసరత్తు చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు చెపుతున్నారు.

శ్మశాన వైరాగ్యం!

అంతిమ సంస్కారం నిర్వహించేందుకు శవంతోపాటు శ్మశానానికి వెళితే.. శ్మశాన వైరాగ్యం వస్తుందంటారు..! కాని, సిద్ధాంతంలోని శ్మశానాన్ని చూస్తే చాలు.. శ్మశాన వైరాగ్యం కలుగుతుందంటారు ఇక్కడి ప్రజలు ! ఎందుకంటే ఇక్కడి వాతావరణం అంత భయానకంగా ఉంటుంది. అంతిమ సంస్కారం నిర్వహించే కనీస సదుపాయలు ఇక్కడ లేకపోవడం.. శ్మశానాన్ని డంపింగ్ యార్డుగా మార్చేయడం విచారకరం. చిన్న చిన్న మారుమూల పల్లెల్లో సైతం శ్మశానాలను ఎంతో గొప్పగా అభివృద్ధి చేస్తుంటే.. ఎంతో ప్రాశస్త్యం వున్న ఈ శ్మశానాన్ని మాత్రం పాలకులు గాలికి వదిలేశారు.

డంపింగ్ యార్డుగా సిద్ధాంతం శ్మశానం

- దుర్గంధంగా మారిన దక్షిణ చిన్నకాశీ
- చుట్టూ చెత్త.. పందుల స్వైర విహారం
- శవ దహనాలకు తప్పని పాట్లు
- కనీస వసతులు కరువు..
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
- మధ్యలోనే నిలిచిన అభివృద్ధి పనులు

పెనుగొండ, ఆగస్టు 26 : సిద్ధాంతం.. పవిత్ర గోదావరి తీరాన వున్న ఓ గ్రామం. జనాభా 20 వేల మంది పైమాటే. ఇక ఈ ఊరి శ్మశానానికి ఓ ప్రత్యేకత వుంది. ఇక్కడ కాశీ మాదిరి రోజూ ఒక్క శవానికైనా అంతిమ సంస్కారం జరపాలని నానుడి. లేని పక్షంలో తల వెంట్రుకలైనా కాల్చి పొగను వదలాలని పెద్దలు చెబుతారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. అందుకే దీనికి దక్షిణ చిన్న కాశీ అని పేరు. ఇక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తే కాశీలో జరిగినట్లే ఈ ప్రాంత వాసులు భావిస్తారు. వారికి శివైక్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే ఈ ప్రాంతానికి నిత్యం ఒకటి, రెండు శవాలకు అంతిమ సంస్కారం జరుగుతుంటుంది. ఇందుకు సిద్ధాంతంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలైన పెనుగొండ, పెనుమంట్ర, తణుకు ప్రాంతాల నుంచే కాకుండా జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల నుంచి మృతదేహాలను ఇక్కడకు తీసుకుని వచ్చి దహన సంస్కారాలు నిర్వహిస్తుంటారు. గోదావరి తీరాన ప్రసిద్ధి ఆలయాలు స్మశానం పక్కనే అనేకం ఉన్నాయి. ఇంతటి ప్రాశస్త్యం వున్న ఈ శ్మశానం ఎలా ఉండాలి ? శోభాయమానంగా తీర్చిదిద్దాలి. కాని ఎలా వుందో తెలుసా? చుట్టూ చెత్తా చెదారంతో దీనిని డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఊళ్లలోని చెత్తను తీసుకువచ్చి ఇక్కడ



చెత్తా.. చెదారంతో దుర్గంధం

వేస్తున్నారు. ఇది కుళ్లిపోవడంతో దుర్గంధం రాజ్యమేలుతుంది. పందులు స్వైర విహారానికి అడ్డే లేదు. వీటి నుంచి వచ్చే దుర్వాసనకు ముక్కులు బద్దలవుతాయి. దీనిని భరించలేక అంతిమ సంస్కారం చేసే వారితో మిగిలిన బంధువులు పెద్దగా రావడం లేదు. దీనిని శుభ్రం చేయాలనే ఆలోచన కనీసం పంచాయతీ అధికారులకు సైతం లేకపోయింది. ఇక శ్మశానానికి వెళ్లే రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడే ఇసుక ర్యాంప్ ఉండటం వల్ల రోజూ వందలాది వాహనాలు వెళ్లడంతో రోడ్డు మరింత ఛిద్రంగా మారింది. దహన సంస్కారాలకు తీసుకువచ్చే ప్రజలు కనీసం కూర్చోవడానికి బెంచీలు లేకపోవడం, స్నానాలు చేయడానికి పుష్కర ఘాట్‌లు అధ్వాన్నంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశాన వాటిక అభివృద్ధికి గత ఎమ్మెల్యే ఐదు కోట్లతో పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు. ప్రభుత్వం మారడంతో పనులు సాగక వర్షం వస్తే దహన సంస్కారాలు పూర్తి కాక నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మధ్యలో నిలిచిన శ్మశాన వాటిక పనులు చేపట్టి, చెత్తను సుదూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజల అసహనం

'సిద్ధాంతంలోని హిందూ శ్మశానం డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఈ కారణంగా ఇక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. పురాణ ప్రసిద్ధి చెందిన ఈ శ్మశానాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలి' అని కప్పల రత్నంరాజు కోరుతున్నారు. 'ఎంతో ప్రసిద్ధి చెందిన సిద్ధాంతం శ్మశానాన్ని కొన్నేళ్ళుగా పట్టించుకునేవారు కరువయ్యారు. దీనిని అభివృద్ధి చేయాల్సింది పోయి గాలికి వదిలి వేశారు. దీంతో చెత్తా చెదారంతో నిండిపోయింది. అంత్యక్రియలకు వచ్చే జనం ఇక్కడి పరిస్థితి చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు.' అని చిన్నం శివ వాపోయారు.

నేడు శ్రీవారి క్షేత్రంలో శ్రీకృష్ణ జయంతి



- ఆర్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు
- 28న ఉట్ల పండుగ, గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: ప్రసిద్ధ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణజయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. అష్టమి మిగులు తిథితో పాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే ఈ ఉత్సవం నేపథ్యంలో స్వామివారికి నిత్యం నిర్వహించే ఆర్జిత కల్యాణం, నిత్యార్జిత సేవలను మంగళవారం రద్దు చేస్తున్నట్లు ఈవో వివరించారు. సాయంకాలం ఉత్సవం అనంతరం నివేదనాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే మరుసటిరోజైన బుధవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వాసవీ ధామ్‌లో ప్రత్యేక పూజలు



పెనుగొండ, ఆగస్టు 26: పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్ నుంచి 15 మంది దంపతులు విచ్చేసి గోమాత పూజ , పంచామృత అభిషేకాలు, దంపతి పూజ, వాసవి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అరట్లకట్టలో పంజాబ్ రైతుల పర్యటన

పాలకొల్లు రూరల్, ఆగస్టు 26: మండలంలోని అరట్లకట్ట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాన్ని పంజాబ్ నుంచి వచ్చిన రైతుల బృందం సోమవారం పరిశీలించింది. ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు ఆధ్వర్యంలో డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ సీహెచ్ శ్రీనివాసులు, నేచురల్ ఫామింగ్ అధికారి చందు రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై వివరాలను తెలిపారు. ఈసందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగులో 9 విధానాలను వివరించారు. బీజామృతం, మన జీవామృతం, ద్రవ జీవామృతం, కోడి గుడ్డు, నిమ్మరసం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, వంటి వాటిని ప్రదర్శనగా చూపించారు. అనంతరం రైతులకు స్వయం సహాయక సంఘ మహిళలతో ముఖాముఖీ చర్చలు నిర్వహించారు. అనంతరం కొమ్ముచిక్కాల, వాలమర్రు గ్రామాల్లో పర్యటించారు. వరిగట్లపై అరటి, కొబ్బరి, అనాస, మునగ, గోరు చిక్కుడు, ఆముదం, బెండ, వంగ టమోటా, మిర్చి, చామంతి, కంద, ఆకు కూరలు, ఆనప, బీర, పసుపు, జామ, వంటి పంటల సాగు విధానాలను పరిశీలించారు.

ఓపీఎస్ పునరుద్ధరణ చేసేవరకు పోరాడతాం

ఉద్యోగుల సర్వీస్ కాలమంతా దాచుకున్న వాటాను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే యూపీఎస్‌ను తీసుకువచ్చినట్టుగా అర్థమవుతోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతున్న విషయాన్ని కేంద్రప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు.

దివ్యాంగ ఉద్యోగుల ఉమ్మడిజిల్లా కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గానికి ఎన్నికైన నాయకులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 : ఏపీ దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏలూరులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సీహెచ్.పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా వి.యుగం ధర్, కోశాధికారిగా ఆసిబాబును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా జె.ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా టి.రాము, సహ అధ్యక్షులుగా కె.దుర్గ, పి.పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.నాగేంద్రసింగ్, డి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జ్యోతి, వెంకటేశ్వరరావు, జగదీష్, రాంబాబు, కృష్ణమూర్తి, డేవిడ్, గంగాధర్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఎల్.విద్యాసాగర్, సీహెచ్.శ్రీనివాస్, ఎం.రాము, హరనాథ్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సతీష్ పాల్గొన్నారు.

17 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లల్లో సీనియార్టీని బట్టి 17 మందికి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సివిల్)గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీనియార్టీని బట్టి పదోన్నతి కల్పిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్ళు

పేరు (నెంబర్)	పని చేస్తున్న ప్రాంతం
ఎండీ రాజా అహ్మద్ (హెచ్‌సీ 69)	ద్వారకాతిరుమల పీఎస్, అటాచ్డ్ సీసీఎస్ ఏలూరు
ఎం హరిశ్చంద్ర ప్రసాద్ (హెచ్‌సీ 1715)	ఏలూరు టూటౌన్
ఏవీఎస్ నారాయణరాజు (హెచ్‌సీ 1728)	డీఎస్పీ ఏలూరు
కె నాగభూషణం (హెచ్‌సీ 1729)	తూర్పుగోదావరి జిల్లా
ఇ శ్రీనివాస్ (హెచ్‌సీ 1731)	పశ్చిమ గోదావరి
ఎం భాస్కరరావు (హెచ్‌సీ 1732)	ఇంటిలిజెన్స్
కె శేషగిరిరావు (హెచ్‌సీ 1734)	పశ్చిమ గోదావరి జిల్లా
పి రాము (హెచ్‌సీ 1735)	డీసీఆర్బీ, ఏలూరు
ఎస్‌కె అమీర్ (హెచ్‌సీ 1736)	పెదవేగి పిఎస్ అటాచ్ టు ద్వారకాతిరుమల పీఎస్
బి ఏసు (హెచ్‌సీ 1737)	ఏలూరు టూటౌన్ పీఎస్ అటాచ్డ్ టు ఏలూరు త్రి టౌన్ పీఎస్
డి వెంకటేశ్వరరావు (హెచ్‌సీ 1739)	ఇంటెలిజెన్స్
ఎన్ఎల్ నారాయణరావు (హెచ్‌సీ 1740)	డీటీసీ పెదవేగి
సీడి గోవిందబాబు (హెచ్‌సీ 1162)	పశ్చిమ గోదావరి
ఎస్ శ్రీనివాసరెడ్డి (హెచ్‌సీ 1741)	పశ్చిమ గోదావరి
పి. రామకృష్ణ (హెచ్‌సీ 1743)	తూర్పుగోదావరి జిల్లా
ఎ సత్యనారాయణ (హెచ్‌సీ 1745)	పశ్చిమ గోదావరి జిల్లా
సిహెచ్ సత్యనారాయణ (హెచ్‌సీ 1747)	పశ్చిమ గోదావరి జిల్లా

ప్రభుత్వాస్పత్రి పూర్తయ్యేనా..?

- వైసీపీ హయాంలో చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు
- బిల్లుల మంజూరులో నాటి ప్రభుత్వం తాత్సారం.. అంచనాలు తల్లకిందులు
- బహుళ అంతస్థుల భవనాలు నిర్మించాలంటే భీమ్ వేయాల్సిందే
- తొలి విడత రూ. 10.15 కోట్లులో అధిక నిధులు భీమ్‌కే
- మళ్లీ రూ. 28 కోట్లు నాబార్డ్ నిధులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.10.15 కోట్లు మంజూరయ్యాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాం 2018లోనే నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిపైనే నిర్మాణాలు చేపట్టాలని భావించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రాధాన్యాలు మారిపోయాయి. భీమవరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంపై మరో అంతస్తు నిర్మాణానికి పనికిరాదని తేల్చారు. భీమవరం-గొల్లవాని తిప్ప రోడ్డులో భూమిని కేటాయించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిధులను అక్కడకు మళ్లించారు. తీరా అక్కడ భూమి భవన నిర్మాణానికి అంత అనుకూలం కాదు. దాంతో 20 అడుగుల లోతు నుంచి భీమ్ వేసుకుంటూ వచ్చారు. కాస్త భవనం నిర్మాణం చేపట్టేప్పటికే నిధులు అయిపోయాయి. ఆసుపత్రికి మళ్లీ అదనపు నిధులు కావాల్సి వచ్చింది. అప్పట్లోనే నాబార్డ్ నుంచి మరో రూ.28 కోట్లు రప్పించారు. కొత్తగా టెండర్‌లు పిలిచారు. పాత కాంట్రాక్టర్ రాలేదు. కొత్త కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. అయినా వైసీపీ హయాంలో పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వం నిధులు ఇస్తుందన్న గ్యారంటీలేకపోవడంతో పనులు నిర్మాణానికి కాంట్రాక్టర్ ఆసక్తి చూపలేదు.

రియల్ ఎస్టేట్ పేరుతో దోపిడీ

భీమవరం పట్టణానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో గొల్లవానితిప్ప రోడ్డు వైపు ప్రభుత్వ ఆసుపత్రిని కొత్తగా నిర్మించడానికి వైసీపీ హయాంలో భూములు కేటాయించడంపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్డుకు ఆనుకుని భూములు ఇవ్వలేదు. భీమవరం-గొల్లవాని తిప్ప రహదారికి కిలో మీటరు లోపల భూమిని కేటాయించారు. అక్కడ నిర్మాణం చేపట్టారు. గొల్లవానితిప్ప రహదారి నుంచి నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి వరకు మాత్రం రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. ప్రభుత్వ ఆసుపత్రి పేరులో రియల్ దందా సాగింది. ఆసుపత్రి నిర్మాణం మాత్రం అలాగే నిలచిపోయింది. ఇప్పటికీ రెండో విడత పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ఎన్నికల ముందు నిర్మాణం చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అదనపు భవనాల నిర్మాణం నిలిచిపోయింది. కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. మధ్యలోనే పనులు ఆగిపోయాయి. భీమవరంలో రూ. 10.15 కోట్లతో పనులు పూర్తి చేసినా సరే ఫలితం లేకపోయింది. అక్కడ భూమి స్వభావాన్ని బట్టి 100 పడకల ఆసుపత్రిని





నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం (ఇన్‌సెట్‌లో) తుప్పు పట్టిపోతున్న ఇనుము

నిర్మించాలంటే మరో రూ.28 కోట్లు అవసరం కానున్నాయని అంచనా వేశారు. నాబార్డు నుంచి నిధులను రప్పించారు. కొత్త కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాసరే పనులు ప్రారంభించలేదు. బిల్లుల సమస్యతోనే ఏజన్సీ చేతులెత్తేసింది.

ఏజన్సీతో సంప్రదింపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ పనులను పరిగణలోకి తీసుకున్నారు. కాంట్రాక్టర్లతో సంప్రదిస్తున్నారు. భీమవరంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కోసం కాంట్రాక్టర్‌తో చర్చలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు సైతం ఏజన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవలే కాంట్రాక్టర్ ఆసుపత్రి ప్రాంతాన్ని సందర్శించారు. వర్షాభావంతో పనులు వాయిదా వేశారు. ప్రస్తుతం అక్కడ ఇసుక, చిప్స్ మాత్రమే దర్శనమిస్తున్నాయి. గతంలో ఉన్న ఇనుము తప్పు పడుతోంది. పొడి వాతావరణం ఏర్పడితే పనులు ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనులు పురోగతి దిశగా పయనిస్తాయని ఆశిస్తున్నారు. అయితే ఆసుపత్రి పేరుతో మాత్రం అక్కడ పదుల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. అనుమతులు లేకుండానే వెంచర్‌లు వేశారు. అమ్మకానికి పెట్టారు. అందులో వైసీపే నేత హస్తం కూడా ఉందన్న విమర్శలున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పేరుతో రియల్ దందాపైనే వైసీపీ హయాంలో ఆసక్తి ఎక్కువగా కనిపించింది. బిల్లులు మంజూరులో తాత్సారం జరిగింది. దాంతో కొత్త పనులు పడకేశాయి. ఇప్పుడు మళ్లీ ఆశలు చిగురించాయి. ఏజన్సీ ప్రతినిధులు ముందుకొస్తున్నారు.

కుళాయిల్లో మురుగు నీరు

చోద్యం చూస్తున్న అధికారులు



కుళాయి నుంచి వస్తున్న మురుగు నీరు

ఆకివీడు, ఆగస్టు 26 : పదవవార్డులో నగర పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరుకు బదులు మురుగునీరు వస్తున్నది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వార్డు కౌన్సిలర్ నేరెళ్ళ ప్రసన్న కూడా అనేక సార్లు సమావేశం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకున్నది. పట్టణంలో సుమారు 70ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు పాడైపోయి మురుగునీరు కలుస్తున్నది. దీంతో ఇరవై వార్డులలో తాగునీటి సమస్య ఉంది.

బాలిక మృతికి వైద్యులు కారకులైతే చర్యలు



సీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీసీహెచ్ సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

ఆకివీడు, ఆగస్టు 26 : బాలిక మరణానికి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బాధ్యులైతే విచారణ అనంతరం చర్యలు చేపడతామని డీసీహెచ్ పి.సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు అన్నారు. దుంపగడపకు చెందిన నిడమోలు దుర్గలహరి (16) తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా శనివారం స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని 108వాహనంలో పంపించారు. మార్గమధ్యలో బాలిక పరిస్థితి విషమించడంతో వాహనాన్ని వెనక్కి తిప్పించి ఆకివీడులో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా అప్పటికే బాలిక మృతి చెందిందని చెప్పిన సంగతి విధితమే. సీహెచ్‌సీ వైద్యులు నిర్లక్ష్యం కారణంగానే బాలిక మరణించిందని పలు పత్రికల్లో వచ్చిన వార్తలతో సోమవారం వైద్యాధికారులు సీహెచ్‌సీకి వచ్చి స్థానిక వైద్యులు, సిబ్బందితో మాట్లాడి విచారణ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రికి ఇటువంటి మేజర్ ఇష్యూ వచ్చినప్పుడు డ్యూటీలో ఉన్న వైద్యులు చూసుకుంటారులే అనుకోకుండా వైద్యులందరూ కలిసికట్టుగా పనిచేసి సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆసుపత్రిలో చిన్న చిన్న లోపాలున్నాయన్నారు. అంతే కాకుండా వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్‌కు సహకరించడంలేదని అటువంటి వారిపై కూడా చర్యలు చేపడతామన్నారు.

వైసీపీ ప్రభుత్వ జీవోలన్నింటినీ రద్దుచేయాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 : విద్యావ్యవస్థకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం జారీచేసిన జీవోలన్నింటినీ కూటమి ప్రభుత్వం రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని సోమవారం ఏలూరు టీడీపీ కార్యాలయంలో సమావేశమైన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ సీహెచ్.సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సంఘ జిల్లాశాఖ తొలి సమావేశంలో ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకట రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీచేసిన అసంబద్ధ ఉత్తర్వుల కారణంగా విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడటానికి జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాల్సిందేనని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల జీవో 84 ఉత్తర్వులను రద్దుచేయాలని, వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడేషన్ అయిన పాఠశాలలకు కొత్త పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా ఆర్థిక కార్యదర్శిగా బి.రాము, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.రఘుకుమార్, మహిళా కార్యదర్శిగా యు.శ్యామల, రాష్ట్ర కమిటీలోకి పి.రాహేలమ్మ, కార్యదర్శిగా టి.విజయానంద్, ఎంటీఎస్ జిల్లా కన్వీనర్‌గా టి.ఎడ్వర్డ్‌లను ఎన్నుకున్నారు. టీడీపి జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి యు.జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

30న యూటీఎఫ్ నిరసనలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 : సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్‌ను పునరుద్ధరణ చేయాల్సిన ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)పేరుతో తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 30న జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు పి.వి.నరసింహారావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఎస్ కంటే యూపీఎస్ మెరుగైన విధానమంటూ ప్రభుత్వం అంకెలగారడీ చేసిందని విమర్శించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధంలేకుండా అన్నిరకాల సదుపాయాలుండే పాత పెన్షన్‌కంటే మరేదీ తమకు అంగీకారంకాదని తేల్చిచెప్పారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో పలువురి అరెస్టు

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: భూతగాదాలో కుమారుడిపై ఇనుప రాడ్డుతో దాడి చేసిన తండ్రి అతని కుమార్తెలు, అల్లుళ్లు, వారి కుమారులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సుధీర్ తెలిపారు. కోడిగూడెం గ్రామానికి చెందిన దౌలూరి కాంతయ్యకు ఉన్న 4 ఎకరాల భూమి విషయమై అతని కుమారుడు ధర్మారావుకు కాంతయ్య కుమార్తెలు దాసరి శ్యామల, బంటుమిల్లి సుజాత మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో కాంతయ్య తన కుమారుడు ధర్మారావును హత్య చేయాలని నిర్ణయించుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో కాంతయ్య తన కుమార్తె దాసరి శ్యామల, అల్లుళ్లు దాసరి గంగరాజు, అతని కుమారులు వంశీ, సుందర్, చిన్నల్లుడు బంటుమిల్లి డేవిడ్‌లతో కలసి ఇనుప రాడ్లు, కత్తులతో దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన ధర్మారావు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో ధర్మారావుపై హత్యాయత్నం చేసిన కాంతయ్య, ఇతరులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఆయన చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ఉంగుటూరు, ఆగస్టు 26: చేబ్రోలు-బాదంపూడి మధ్య చేబ్రోలు రైల్వే స్టేషన్ యార్డు వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని 45-50 సంవత్సరాల వయసు గల మహిళ రైలు ఢీకొని మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. చనిపోయిన మహిళ లేత పసుపు రంగుపై తెలుపు పువ్వుల డిజైన్ టాప్ ఎరుపు రంగు ఫ్యాంటు చిరిగిన బ్లూ కలర్ చున్ని ధరించిందని తెలిపారు. మృతదేహం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చ్యూరిలో ఉంచినట్లు తెలిపారు. వివరాల కోసం 80191 57528, లేదా 99480 10061లో సంప్రదించాలని కోరారు.

డ్రై క్లీనింగ్‌షాప్‌లో అగ్నిప్రమాదం



భీమవరం క్రైం, ఆగస్టు 26 : పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలో బాలాజీ డ్రై క్లీనింగ్ షాపులో సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.30 వేలు నష్టం ఏర్పడిందని ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు తెలిపారు. గ్రంధి వెంకట్రావుకు చెందిన బిల్డింగ్‌లో పి.బాలాజీ కొంత కాలంగా డ్రై క్లీనింగ్ షాపు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం రాత్రి షాపులోపల పొగ వ్యాపించడంతో అందిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వెళ్ళి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నట్లు సూర్యప్రకాశరావు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్ళిందని ఆత్మహత్యా యత్నం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 26: భార్య పుట్టింటికి వెళ్ళిందని మనస్థాపం చెంది భర్త ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. డైలీ కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్న నాగేంద్ర తన భార్య ప్రసన్నతో గొడవపెట్టుకోవడంతో ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో సోమవారం తన ఇంటివద్ద బ్లేడుతో చేతులపై కోసుకున్నాడు. రక్త స్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళడంతో స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఎనిమిది బైక్‌లు, రూ.15,800 నగదు స్వాధీనం

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: ఐఎస్ జగన్నాథపురంలో కోడిపందేల స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మోటార్ సైకిళ్లు, మూడు పుంజులు, రూ.15,800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 12మంది పందెగాళ్లను అరెస్టు చేసినట్లు వివరించారు.

కాపర్‌వైర్ దొంగల ముఠా అరెస్టు

- 400 కేజీల కాపర్ స్వాధీనం..
- ఐదుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిషోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను రాత్రి వేళ పగులగొట్టి అందులోని కాపర్‌వైరును అపహరించుకుపోయే ఒక ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిషోర్ ఆ ముఠా వివరాలను వెల్లడించారు. జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం పరిసర ప్రాంతాల్లో మొత్తం 40కిపైగా ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును అపహరించుపోయారు. జీలుగుమిల్లి సీఐ బి వెంకటేశ్వరరావు, మరో సీఐ సీహెచ్ రాజశేఖర్, బుట్టాయిగూడెం ఎస్ఐ మల్లేశ్వరరావు, జీలుగుమిల్లి ఎస్ఐ నవీన్ వారి సిబ్బంది కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. బుట్టాయిగూడెం మండలం మర్లగూడెం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా మోటారుసైకిల్‌పై వెళ్తుండగా వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 కేజీల కాపరువైరు, విద్యుత్ ట్రాన్స్‌ఫారాలను పగులగొట్టడానికి ఉపయోగించే వస్తువులు ఉండడాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేశారు. వీరంతా జీలుగుమిల్లిలో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలని వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌వైరును దొంగిలిస్తున్నారు. ప్రధాన నిందితులు అయిన జీలుగుమిల్లికి చెందిన గోపి కిరణ్ (25)ను అదుపులోకి తీసుకోగా అతనిపైన 19 కేసులు ఉన్నాయని గతంలో పీడీ యాక్టు కూడా ఉందని ఇటీవల తెలంగాణా రాష్ట్రంలో నమోదైన కేసులో 10 నెలల పాటు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి వచ్చినట్లుగా గుర్తించారు. జీలుగుమిల్లికి చెందిన పునుకుమాటి నరసింహారావు (38) గతంలో గోపాలపురం, నల్లజర్ల పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు ఉన్నాయన్నారు. జీలుగుమిల్లికి చెందిన షేక్ హుస్సేన్ (27) ఈ ముగ్గురు కలిసి తెలంగాణా రాష్ట్రం అశ్వరావుపేటనకు చెందిన తోట శ్రీనివాసరావు (58)కి విక్రయించే వారు. శ్రీనివాసరావు ఆ వైరును విజయవాడనకు చెందిన పదాతి సతీష్ కుమార్ (39)కు విక్రయించేవారు. నేరానికి పాల్పడిన ఆ ముగ్గురితో పాటు దొంగసొత్తు కొనుగోలు చేసిన శ్రీనివాసరావు, సతీష్ కుమార్‌లను కూడా అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు. వీరి నుంచి రెండు లక్షల 40 వేల రూపాయల విలువైన 400 కేజీల కాపర్‌వైరు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు.

ఏటీఎం చోరీలో అన్నదమ్ములే నిందితులు!



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

ముదినేపల్లి, ఆగస్టు 26 : ముదినేపల్లిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం చోరీకి యత్నించి పరారైన దుండగులను కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. మండవల్లి మండలం పుట్ల చెరువు గ్రామానికి చెందిన సోదరులైన బెండి రామకృష్ణ, బెండి లక్ష్మీనారాయణలను సోమవారం ఉదయం ముదినేపల్లి - గుడివాడ ప్రధాన రహదారిలో కల్వపూడి సత్రం రోడ్డు వద్ద అరెస్టు చేసి చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా ముందుంచారు. నిందితుడు రామకృష్ణ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి సుమారు రూ. 3 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఏటీఎం చోరీని ఎంచుకుని, హైదరాబాద్‌లో ఉంటున్న తన అన్న లక్ష్మీనారాయణను రప్పించాడు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక లక్ష్మీనారాయణను ఏటీఎం బిల్డింగ్‌పై కాపలా పెట్టి రామకృష్ణ విద్యుత్ కనెక్షన్ తొలగించి ఏటీఎంను ధ్వంసం చేసి నగదు అపహరించేందుకు యత్నించిన సమయంలో అలారం మోగి పోలీసులు రావడంతో వారు పారిపోయారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం గాలించి సోమవారం అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. దుండగులను త్వరితగతిన పట్టుకోవటంలో నైపుణ్యం చూపించిన ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, కానిస్టేబుల్ బి.నాగబాబును ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, డిఎస్పీ శ్రావణ్ కుమార్ అభినందించారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

మొగల్తూరు, ఆగస్టు 26: మండలంలోని కొత్తోట గ్రామంలో అనధికారికంగా మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు సోమవారం నిలుపుదల చేశారు. గ్రామస్థుల నుంచి మట్టి అక్రమ రవాణాతో కలుగుతున్న ఇబ్బందులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో తహసీల్దార్ విద్యాపతి ఆదేశాలతో గ్రామంలో మట్టి తవ్వకాలను నిలుపుదల చేశామని, అధికారులు ఆదేశాలు లెక్కచేయకుంటే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లను సీజ్ చేస్తామని ఆగ్రామ వీఆర్వోలు శ్యామ్యూల్ రాజు, మహలక్ష్మీ హెచ్చరించారు.

అత్తింటి వేధింపులతోనే కార్తీక్ మరణం

దళిత నాయకుల ఆరోపణ

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : భార్యతోపాటు అత్తింటివారు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేయడం వల్లే న్యాయవాది పయనం కార్తీక్ అనారోగ్యానికి గురై మరణించాడని దళిత నాయకులు, న్యాయవాదులు, కార్తీక్ తల్లి దండ్రులు ఆరోపించారు. ఏలూరు శంకరమఠం వీధిలోని కార్తీక్ పెద్ద కర్మ కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైకోర్టు న్యాయవాది వి ఉదయ్‌కుమార్, ఎస్సీఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు సబవరాజు, ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాది జీపీ డానియేల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కార్తీక్ తండ్రి రత్నరాజు మీడియాతో మాట్లాడారు. ఏలూరులోని శంకరమఠం వీధిలో రాజూస్ ఐఎస్ అకాడమి కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న న్యాయవాది పయనం రత్నరాజు గతంలో హైదరాబాద్‌లో ఉండంగా అతని పెద్ద కుమారుడు అయిన పయనం కార్తీక్ హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరినకు చెందిన మనిషా ప్రియా యాదవ్ అనేక యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆరేళ్ళపాటు సజావుగా కాపురం చేశారు. మనిషా ప్రియా యాదవ్ తండ్రి మరణించడంతో ఆమెను హైదరాబాద్ పంపించారు. ఆతరువాత ఆమె అప్పటి నుంచి తిరిగి రాలేదని ఆమెతో పాటు అత్తింటివారు శారీరకంగా, మానసికంగా కార్తీక్‌ను వేధించారని అంతేకాకుండా హైదరాబాద్‌లో వరకట్న వేధింపుల కేసు పెట్టి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయించి ఏలూరు టూటౌన్ పోలీసులకు రిఫర్ చేయించారన్నారు. పోలీసులు దర్యాప్తులో వైఫల్యం చెందారని ఆరోపించారు. వారు వేధింపులు భరించలేక కార్తీక్ అనారోగ్యానికి గురై ఈనెల 14వ తేదీన మృతి చెందాడన్నారు.

ఏలూరులో చైన్ స్నాచింగ్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : దేవాలయానికి వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెనుక నుంచి వచ్చి ఒక మహిళ మెడలోని బంగారపు గొలుసును తెంపుకుని ఆమెను తోసివేసి పారిపోయారు. ఏలూరు తూర్పు వీధికి చెందిన మద్దు జ్వాల (53) సోమవారం రాత్రి శ్రీ కృష్ణామి సందర్భంగా వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళి తిరిగి తన ఇంటికి నడిచి వెళ్తుండగా ఇంటి సమీపానికి వెళ్ళే సరికి వెనుక నుంచి ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో మూడు కాసుల బంగారపు చైన్‌ను తెంపుకుని ఆమెను తోసి వేశారు. వెంటనే పరారీ అయ్యారు. గోడ తలకు తగలడంతో గాయాలపాలైన ఆమెను ఒక ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరలో ఎన్డీఏ కూటమి కమిటీల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన రామరాజు

భీమవరం అర్బన్, ఆగస్టు 26 : త్వరలోనే ఎన్డీఏ కూటమి నియోజకవర్గ సమన్వయ కమిటీల నియామకాలు జరుగుతాయని టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అన్నారు. భీమవరం నియోజకవర్గ వీరవాసరం, భీమవరం మండల కమిటీల సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర పొలిట్‌ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల, పట్టణ నియోజకవర్గ స్థాయి వరకు ఎన్డీఏ కూటమి సమన్వయ కమిటీల ఏర్పాటుకు బీజేపీ, జనసేన టీడీపీ నాయకులతో చర్చిస్తున్నామన్నారు. పొలిట్‌ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌ ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నారనన్నారు. అనంతరం రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారఽథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడారు. వీరవాసరం మండల టీడీపీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్‌, వీరవల్లి శ్రీనివాస్‌, భీమవరం మండల నాయకులు రేవు వెంకన్న, కౌరు పృధ్వీశంకర్‌, వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, తదితర నాయకులు పాల్గొన్నారు.

యువత సేవాభావం అలవర్చుకోవాలి : అంజిబాబు


యూత్‌ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్‌, ఆగస్టు 26:అన్ని రంగాల్లోనూ దేశం అభివృద్ధి చెందాలంటే యువతతోనే సాధ్యమని, యువత సేవాభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం మన్నా చర్చి ఆవరణలో యూత్‌ ఆధ్వర్యంలో యూత్‌ ఫెస్ట్‌ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో యువత ద్వారానే కూటమి విజయం సాధించిందని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. దావదాసు సంఘ కాపరి, అసిస్టెంట్‌ పాస్టర్లు సన్నీ జోసెఫ్‌, సారా గ్రేస్‌, మన్నాచర్చి యూత్‌ సభ్యులు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్‌, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, చేపల రాము, చల్లా రాము, కొప్పినీడి రాము పాల్గొన్నారు.

ఆర్థిక లేమితో విద్యకు దూరం కాకూడదు

ప్రతిభ ఉండి ఆర్థిక లేమితో విద్యకు దూరంగా ఉన్నా పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థుల చదువు నిమిత్తం రూ.25వేలు విజయ సంజన అపార్టుమెంట్‌ వాసుల సహకారంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి అపార్టుమెంట్‌ కమిటీ సభ్యులు చల్లారావు, టీవీవీ ప్రసాద్‌, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కమిషనర్‌

ఆకివీడు, ఆగస్టు 26 : ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్‌ జి.కృష్ణమోహన్‌ అన్నారు. స్థానిక పదకొండోవ వార్డులోని సప్పా వీధిలో సోమవారం బ్లీచింగ్‌, స్ర్పే చేయించి మాట్లాడారు. డెంగీ లక్షణాలతో బాధితుడుతున్న భోగరాజు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని త్వరగా కోలుకుంటాడన్నారు. జ్వర లక్షణాలు కనబడితే వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. మేనేజర్‌ వెంకటేశ్వరరావు ఉన్నారు.

డెంగీ నిర్ధారణ అవసరం

తణుకు, ఆగస్టు 26: డెంగీ లక్షణాలుంటే నిర్ధారణ కోసం బ్లడ్‌ శాంపిల్‌ను తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్‌కు పూర్తి వివరాలతో పంపించాలని జిల్లా మలేరియా ఆఫీసర్‌ రవికుమార్‌ అన్నారు. సోమవారం తణుకు బ్యాంకు కాలనీలో అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌, బాలాజీ, సుదర్శన్‌ ఆసుపత్రిలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో జ్వరాల కేసుల విషయంలో ఏడు రోజులు పైబడి జ్వరంతోపాటు డెంగీ లక్షణాలుంటే నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్‌, ఆగస్టు 26: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో ఆర్‌అండ్‌బీ రహదారి పనుల నిమిత్తం మంగళవారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ ఎస్‌. వెంటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవార్డు గ్రహీతలు ప్రమీల దంపతులకు అభినందనలు

ఉండి ఆగస్టు 26: చెరుకువాడకు చెందిన బందెల జార్జీ ప్రమీల దంపతులు జాతీయ అవార్డులు అందుకున్నారు. సోమవారం మదర్‌ థెరిస్సా జయంతి పురస్కరించుకుని విజయవాడలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్స్‌ సర్వీస్‌ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఎం.ప్రసాదరావు, నేషనల్‌ సెక్రటరీ ఎన్‌జీవోస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆల్‌ ఇండియా క్రిస్టియన్‌ ఫెడరేషన్‌ జిల్లా అధ్యక్షుడు బందెల జార్జీ సేవా కార్యక్రమాలు గుర్తించి అంబేద్కర్‌ జాతీయ అవార్డును, ఆయన సతీమణి ప్రమీలకు మదర్‌ థెరిస్సా అవార్డులను అందించినట్టు తెలిపారు. వారిని పలువురు అభినందించారు.

రేపు కౌన్సిల్‌ సమావేశం

నరసాపురం టౌన్‌, ఆగస్టు 26: నరసాపురం మునిసిపల్‌ కార్యాలయంలో ఈనెల 28న కౌన్సిల్‌ సమావేశం నిర్వహిస్తున్నట్టు కమిషనర్‌ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. చైర్‌పర్సన్‌ వెంకటరమణ ఆధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలన్నారు.

భీమవరంలో క్రీడా దినోత్సవ పోటీలు

భీమవరం టౌన్‌, ఆగస్టు 26 : హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం పేరిట సోమవారం నుంచి క్రీడా సంబరాలు ప్రారంభించామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.రాజేష్‌ తెలిపారు. దీనిలో భాగంగా భీమవరం డీఎన్నార్‌ కాలేజీ అండ్‌ ఎస్‌సీహెచ్‌ బీఆర్‌ఎం హైస్కూల్‌లో 27వ తేదీన 18 నుంచి 60 ఏళ్ళ వయస్సు మధ్య గల క్రీడాకారులకు పలు క్రీడాపోటీలు నిర్వహణ, 28న పిల్లలకు క్రీడా పోటీల నిర్వహణ, 29న 3కే ర్యాలీ నిర్వహణ, అత్యుత్తమ క్రీడాకారుల సన్మానం, 30, 31న పలు సామాజిక మాధ్యమాల ద్వారా క్రీడా ఐక్యత, సృజనాత్మక, క్రీడా చిత్రాలు, లఘుచిత్రాలు, వ్యాసరచన, చిత్ర కళల ప్రదర్శన ఉంటాయన్నారు.


రహదారిపై వున్న గుంతలో నిలిచిన వర్షపునీరు

గొయ్యి పూడ్చండి మహాప్రభో

పెనుమంట్ర, ఆగస్టు 26 :మండలంలోని బ్రాహ్మణ చెరువు వీరవాసరం రహదారిలో పాలమూరు శివారు నవుడూరు సెంటర్లో ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోతిలో పడితే అంతే సంగతి. వర్షం వస్తే చాలు ఆ ప్రాంతంలో చెరువును తలపిస్తుంది. పాలమూరు హాస్టల్‌ నుంచి నవుడూరు సమీపం వరకు కొత్తగా రోడ్డు నిర్మించారు. మధ్యలో కొంత భాగం రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు.. ఆ ప్రాంతంలో కురిసిన వర్షంనీరు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపైకి నీరు వచ్చి చేరుతుంది.. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు.. తక్షణమే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


భీమవరంలో శ్రీకృష్ణుడి బొమ్మల కొలువు, ప్రసాదాలతో అలంకరణ..బైరాగిమఠంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు.. పాలకొల్లులో ఉట్టి కొడుతున్న యువత.. అత్తిలిలో వేణుగోపాలస్వామి వారు


భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీలో సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు బహుమతులు అందించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

పాలకొల్లు అర్బన్‌, ఆగస్టు 26 : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలో పలు ఆలయాల వద్ద వేడుకగా పండుగ జరుపుకున్నారు. యర్రవంతెన వద్ద గల శ్రీకృష్ణుని ఆలయం వద్ద ఉదయం పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించి, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. 24వ వార్డు శంభేశ్వర స్వామి ఆలయంలో, క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద, శ్రీక్షీరా రామానగర్‌లోనూ యువకులు ఉట్టి కొట్టారు.

● భీమవరం అర్బన్‌/భీమవరం టౌన్‌ : భీమవరంలోని 6వ వార్డులోని బాలం వారి యుత్‌ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి విజేతకు గోల్డ్‌ క్వాయిన్‌ను బహుమతిగా అందించారు. బాలం యుత్‌ సభ్యులు సురేష్‌, గణేష్‌, ఫణి, ప్రసాదు, తులసీ రామ్‌, సోమేశ్వరరావు, గోవింద్‌, పవన్‌, శ్రీను, ప్రభుదాస్‌, శ్యాంబాబు పాల్గొన్నారు. భీమవరం హౌసింగ్‌ బోర్డు కాలనీలోని వెంకట సాయిబాబా మందిరలో శ్రీసాయి సేవా భక్తులచే సామూహికంగా శ్రీకృష్ణాష్టకం పారాయణ విశేష పూజలు నిర్వహిం చారు. ప్రసాదాలు అందించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా బొండా రాంబాబు, లక్ష్మి రమణ దంపతుల నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఎస్‌ఆర్‌కేఆర్‌ కళాశాల రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ పి.సుబ్బారావు మాట్లాడుతూ బొమ్మల కొలువుతతో పాటు సుమారు 108 రకాల వంటకాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గునుపూడి బంట్రోతుల వారి వీధిలోని వేణుగోపాల స్వామి మందిరంలో శ్రీకృష్ణునికి లక్ష తులసి పూజ నిర్వహించారు. దుర్గారావు, చంద్రశేఖర్‌, సత్యనారాయణ దంపతులచే స్వామివారికి విశేష పూజలను నిర్వహించి లక్ష తులసి పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈనెల 28న అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గునుపూడి పంచారామక్షేత్రమైన సోమేశ్వరస్వామి జనార్దనస్వామి ఆలయం పక్కన ఉన్న కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఉట్టి కొట్టి గ్రామోత్సవం నిర్వహించారు. భీమేశ్వరస్వామి ఆలయం వద్ద బేతాళ మందిరం వద్ద పలు ప్రాంతాలలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు.


భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో కృష్ణుడికి అలంకరణ

● ఆకివీడు/ఉండి/కాళ్ల/పాలకోడేరు : ఆకివీడులో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పలు చోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఉండి మండలంలో ఉండిలో వేణుగోపాలయాదవ సంఘం ఆధ్వర్యంలో 46వ శ్రీకృష్ణజయంతి ఉత్సవాల పురస్కరించుకుని స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉండి సంతమార్కెట్‌ అంజనేయస్వామి ఆలయం వద్ద 28వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కాళ్ళ మండలం పెదఅమిరంలోని రాధాకృష్ణ మందిరంలో గ్రామ సర్పంచ్‌ డొక్కు సోమేశ్వరరావు, యాదవ సంఘం ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో చిన్నారులను కృష్ణుడు, గోపిక వేషధారణలు అలంకరించి, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పాలకోడేరు మండలం. గొల్లలకోడేరు గ్రామంలో ఏర్పాటు చేసిన కృష్ణమందిరం వద్ద గొల్లలకోడేరు, పాలకోడేరు, గొరగనమూడి, కుముదవల్లి, శృంగవృక్షం తదితర గ్రామ సెంటర్లలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● ఆచంట : ఆచంట మండలంలో శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు పురస్కరిం చుకుని చిన్నారులను కృష్ణుడు వేషధారణలు వేయించారు. పెదమల్లం శివారు గొల్లగూడెం వద్ద ఉన్న శ్రీకృష్ణుని ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నసమారాధన చేపట్టారు.

● నరసాపురం రూరల్‌/మొగల్తూరు : నరసాపురం పట్టణ, మండలంలోని పలు సెంటర్లలో ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీహరిపేటలో నిర్వహిం చిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ పాల్గొన్నారు. మొగల్తూ రు మండలం మొగల్తూరులోని పురాతన రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయం, రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోట లోని శ్రీకృష్ణుడు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొగల్తూరు పెద్ద గొల్లగూడెం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో శ్రీకృష్ణుడుని బాణసంచా కాలుస్తూ, తీన్‌మార్‌ వాయిద్యాలతో స్వామిని ఊరేగించారు.

● తణుకు/అత్తిలి/ఇరగవరం : తణుకు పట్టణంలోని శ్రీకృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అత్తిలి మండలం అత్తిలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. బల్లిపాడు మదనగోపాల మోడల్‌ పాఠశాలలో జన్మాష్టమి సందర్భంగా ప్రిన్సిపాల్‌ తిరుపతి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుమ్మంపాడు శ్రీహరి ప్రహ్లాదపురంలో గల సుబ్రహ్మణ్యేశ్వర గోమహాలక్ష్మి సమేత నారికేళ వరహాలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలోని గోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటం ఆడారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. గీతా ప్రవచనాలను డాక్టర్‌ ఎన్‌. అనంత లక్ష్మి వివరించారు. ఆలయ ఛైర్మన్‌ పులపర్తి గిరిజ తదితరులు పాల్గొన్నారు. అత్తిలి శివారు అజయ్‌నగర్‌లో శ్రీ కృష్ణ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా కాగిత సోమసుందర గోపాల స్వామి దంపతులు పూజలు జరిపారు. సెప్టెంబరు ఒకటో తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని అత్తిలి పట్టణ యాదవ సంఘ సభ్యులు తెలిపారు. ఇరగవరం మండలంలోని ఇరగవరం, ఏలేటిపాడు, కత్తవపాడు, అయినపర్రు, కంతేరు, రేలంగి తదితర గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

● గణపవరం : జగద్గురు శ్రీకృష్ణభగవానుడు అందించిన మొదటి గ్రంథం భగవద్గీత అని యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్థానిక శ్రీకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్‌ బైరబోయిన మాల్యాద్రి యాదవ్‌ అన్నారు. గణపవరంలో ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు


తాడేపల్లిగూడెం ఇస్కాన్‌ ఆలయంలో అలంకరణలో స్వామివారు

తాడేపల్లిగూడెం రూరల్‌/పెంటపాడు : భగవం తుడి సేవే జీవుడి ధర్మమని భాగవతం చెబుతోందని ఇస్కాన్‌ తాడేపల్లిగూ డెం శాఖ నిర్వాహ కులు మురళీధర శ్యాందాస్‌ అభిభాషించారు. పట్టణంలోని ఇస్కాన్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కడియద్దలో అన్నసమా రాధన జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్‌, మద్దిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో పూజలు చేశారు.

కె.పెంటపాడు బైరాగిమఠం ఆలయాల్లో..

పెంటపాడు మండలం కె.పెంటపాడులోని ప్రసిద్ధ బైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఒడిశా సంప్రదాయంలో కృష్ణాష్టమి వేడుకలు ఆలయ ఫిట్‌పర్సన్‌ రవిశంకర్‌ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రకాల ప్రసాదాలను తయారు చేసి భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఆలయ ప్రాంగణం వద్ద చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో నందోత్సవం (ఉట్టి కొట్టుడు) జరుగుతుందని తెలిపారు.

సేవకు ప్రతి రూపం థెరిసా

» కాపు వనిత క్లబ్‌ రీజనల్‌ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ రాజ్యలక్ష్మి

» వాడవాడలా ఘనంగా మదర్‌ థెరిస్సా జయంతి వేడుకలు



ఆకివీడులో నర్సులను సన్మానిస్తున్న డీసీహెచ్‌ఎస్‌ సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

నరసాపురం టౌన్‌, ఆగస్టు 26: సేవకు ప్రతిరూపం మదర్‌థెరిసా అని కాపు వనిత క్లబ్‌ రీజనర్‌ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో స్టీమర్‌రోడ్‌లోని థెరిసా విగ్రహానికి క్లబ్‌ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సమితి వ్యవస్థాపకులు దివి సత్యన్‌ ఆధ్వర్యంలో పేదలకు టీషర్టులు పంపిణీ చేశారు. పి.ఉమామహేశ్వరి, స్వర్ణలత, ఉష, కమల, వెంకటరమణి, నాగమణి, శివ కనక సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఆకివీడు/ఉండి :నిరుపేద నిర్భాగ్యుల సేవకురాలు మదర్‌ థెరిసా అని డీసీహెచ్‌ఎస్‌ పి.సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఆమె విగ్రహానికి ఆకివీడు, ఆదర్శ, అభయ,గోల్డెన్‌ ఆక్వా క్లబ్‌ల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ సేవలందించిన నర్సులను సన్మానించారు. ఆకివీడు, ఆదర్శ అభయ, గోల్డెన్‌ ఆక్వా క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శి కోశాధికారులతో పాటు వైద్యులు ఉన్నారు. ఉండి మండలం ఉండి లయన్స్‌ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు ఆధ్వర్యంలో ఉండి పీహెచ్‌సీలో మదర్‌ థెరిసా జయంతి కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పండ్లు పంచిపెట్టారు. డా.సాయిచంద్ర, రుద్రరాజు నరసరాజు, బొండా కేశవరావు, నంబూరి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

● తణుకు : పేదలకు మదర్‌ థెరిసా అందించిన సేవలు అందరికీ ఆదర్శమని సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్‌ చౌదరి అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో డాక్టర్‌ రామలక్షి ఆధ్వర్యంలో థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. ఉత్తమ సేవలందిస్తున్న నర్సులు జి.లక్ష్మికుమారి, బి.కమలకుమారి, ఉట్ల జాన్‌వల్లి, కె.రాధను సత్కరించారు. సంఘ సభ్యుడు దాట్ల రామరాజు రూ. పదివేలు చెక్కును విరాళంగా అధ్యక్షుడు కరుణాకర్‌ చౌదరికి అందజేశారు. సంఘ నాయకులు నల్లజర్ల వెంకటేశ్వరరావు, ఎండీ స్వాలిహా పాల్గొన్నారు.

● తణుకు లయన్స్‌ క్లబ్‌లో థెరిసా చిత్రపటానికి అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ, దామెర రంగారావు, నల్లజర్ల వెంకటేశ్వరావు, ఆకుల వెంకటేశ్వరావు, కోటేశ్వరరావు, పీవీ రమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సజ్జాపురంలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో థెరిసా విగ్రహానికి సంస్థ గౌరవాధ్యక్షుడు పైబోయిన ఏసుబాబు, అధ్యక్షుడు దేవరపల్లి రత్నరాజు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

● పెనుమంట్ర : పెనుమంట్ర మండలం మార్టేరులో మదర్‌ థెరిసా హెల్పింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కర్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కోడేరు రోడ్డులో ఉన్న మదర్‌ థెరిస్సా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాకా రాజు, నక్కా నరేష్‌ కుమార్‌, నల్లి రాజు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్‌/పెంటపాడు : తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో తాడేపల్లిగూడెం లయన్స్‌ ఆధ్వర్యంలో థెరిసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. లయన్‌ మదన్‌మోహన్‌ అగర్వాల్‌ సహకారంతో ముగ్గురు స్టాఫ్‌ నర్సులను సత్కరించారు. రోగులకు, పండ్లు, బ్రెడ్‌ పంపిణీ చేశారు. పెంటపాడు మండలం దర్శిపర్రులో మదర్‌ థెరిసా యూత్‌ ఆధ్వర్యంలో థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, గ్రామంలో విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. యూత్‌ సభ్యులు పాలూరి సతీష్‌, మాదిరెడ్డి రమేష్‌, శ్రీరాముల రాజు, జువ్వలపాలెపు సత్యనారాయణ, కె. నవీన్‌, పి.అచ్యుత్‌, జి.రంగా పాల్గొన్నారు.

● గణపవరం : గణపవరంలోని లయన్స్‌ క్లబ్‌, కాశీపాడులోని పీఎంపీల అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మదర్‌థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు పులిహార, బూరెలు, అరటిపండ్లు, పాలప్యాకెట్లు అందజేశారు. కాశీపాడులో పీఎంపీల అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే.పరమేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు ఆధ్వర్యంలో కుష్టు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సురక్షిత తాగునీరే లక్ష్యం : ఎమ్మెల్యే రఘురామ


దొడ్డనపూడిలో ఓహెచ్‌ఎస్‌ఆర్‌ ట్యాంక్‌ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామ, రామరాజు తదితరులు

కాళ్ళ/ ఆకివీడు రూరల్‌, ఆగస్టు 26 : గ్రామాల్లోని ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో జల్‌ జీవన్‌ మిషన్‌ నిధులు రూ.70.70 లక్షలతో నూతనంగా నిర్మించిన రెండు ఓహెచ్‌ఎస్‌ఆర్‌ ట్యాంకులను సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్‌ కొల్లి సుబ్బారావు అధ్యక్షతన జరిగి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలని లక్ష్యంతో నియోజకవర్గానికి మంజూరైన సుమారు రూ.110 కోట్లు నిధులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్‌ ముత్యాల రత్నం, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్‌, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై రాజీపడేది లేదు

ప్రజారోగ్యం విషయంలో రాజీపడేది లేదని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. ఆకివీడు మండలం దుంపగడపలో ఆదివారం విష జ్వరంతో మృతి చెందిన బాలిక కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందించి ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీరు కలుషితమవుతుందని తెలుసుకుని దానికి కారణమైన ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌ ముద్దే విశ్వేశ్వరరావు, మోటుపల్లి రామవరప్రసాదు, పి.శ్రీనివాసరాజు, గొంట్లా గణపతి, ప్రభుత్వ వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

● జ్వరంతో మృతి చెందిన బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో దుంపగడపలో ధర్నా నిర్వహించారు. టెన్త్‌ విద్యార్థిని మృతిపై ప్రభుత్వం విచారణ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. జేఎస్‌వీ గోపాలన్‌, కె.తవిటినాయుడు, డోకల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితుల సదస్సు జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం రూరల్‌, ఆగస్టు 26: సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడలో జరిగే భూ బాధితుల సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలో సోమవారం సదస్సు పోస్టర్‌ల ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదల భూములు స్వాధీనం చేసుకోవడంతోపాటు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేశారని అప్పట్లో దీనిపై పోరాడినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ సమస్యలపై ప్రత్యేకంగా సదస్సు నిర్వహించి బాధితుల పక్షాన నిలుస్తామన్నారు. వి.మేరి,బాలు, ఎస్‌. కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

'మహాకవుల రచనలు చిరస్మరణీయం'

భీమవరంటౌన్‌, ఆగస్టు 26 : తెలుగు మహాకవుల రచనలు యుగాంతం వరకు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామి దేవస్థానం తెలుగు భాషా వేడుకలను, భాషోద్యమ నాయకులు గిడుగు రామ్మూర్తి జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆర్య వైశ్యల యువజన సంఘ నాయకుడు వబిలిశెట్టి రామకృష్ణ, నాటక ప్రయోక్త, కళారంజని నాటక అకాడమి అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్‌, తెలుగు పండితు డు కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ తెలుగు భాష అనంతమైనదని, జీవనది వంటిదన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు విద్యార్థులకు పలు అంశాలపై పోటీ లను నిర్వహిస్తామని, 28న 16 మంది తెలుగు పండితులకు ఎమ్మెల్యే అంజి బాబు చేతుల మీదుగా సత్కారం, 29న ముగింపు రోజున బహుమ తులను అందజేస్తామన్నారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్‌ నాయుడు, వారణాసి రాధాకృష్ణ, మెంటే పూర్ణచంద్రరావు, కొత్త శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్ల ప్రక్రియ విరమించుకోవాలి

భీమవరం అర్బన్‌, ఆగస్టు 26: వ్యవసాయ విద్యుత్‌ మోటార్లకు స్మార్ట్‌ మీటర్లు పెట్టే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్‌ చేశారు. ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సమావేశం సోమవారం ఆర్టీసీ ఎంప్లాయిస్‌ యూనియన్‌ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతాంగానికి సకాలంలో ప్రభుత్వ సాయం అందించాలన్నారు. రైతు సంఘాల నాయకులు వైవీ ఆనంద్‌, చల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాదు, తిరుమాని కామేశ్వరరావు, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.


మావుళ్ళమ్మకు బంగారం బహూకరణ


మావుళ్ళమ్మకు బంగారం అందిస్తున్న భక్తులు

భీమవరంటౌన్‌,ఆగస్టు 26 : మావుళ్ళమ్మ అమ్మవారికి హైదరాబాద్‌కి చెందిన మోహన్‌బాబు శ్రావణి దంపతులు ఎనిమిది గ్రాముల బంగారం అమ్మవారికి బహూకరించారు. తొలుత దంపతులు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి శేషవస్త్రం ప్రసాదాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్‌ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్రిగోల్డ్‌ బాధితులకు న్యాయం చేయాలి

భీమవరం టౌన్‌, ఆగస్టు 26 :అగ్రిగోల్డ్‌ బాధితుల డిపాజిట్‌ల సొమ్ము చెల్లించి న్యాయం చేయాలని అగ్రిగోల్డ్‌ కస్టమర్స్‌ అండ్‌ ఏజెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సోమవారం భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబుకు వినతి పత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పదిన్నర లక్షల మంది బాధితులకు రూ.3,080 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అగ్రిగోల్డ్‌ సమస్య పరిష్కారానికి స్పెషల్‌ పర్పస్‌ వెహికల్‌ ఏర్పాటు చేయాలని, అగ్రిగోల్డ్‌ ఆస్తులన్నింటినీ సంరక్షించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. అసోసియేషన్‌ భీమవరం బ్రాంచి గౌరవాధ్యక్షుడు ఎం.సీతారాంప్రసాద్‌, అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.


అమరావతిలోని జనసేనపార్టీ కార్యాలయంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి సోమవారం జనవాణిలో పాల్గొన్న చాగంటి చిన్న


నరసాపురంలో కేక్‌ కట్‌ చేస్తున్న కొవ్వలి నాయుడు, కూటమి నేతలు

ఘనంగా 'కొవ్వలి' జన్మదిన వేడుకలు

నరసాపురం టౌన్‌/మొగల్తూరు, ఆగస్టు 26: టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కొవ్వలి నాయుడు జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌ చేశారు. కూటమి నాయకులు అధిక సంఖ్యలో విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. సంకు భాస్కర్‌, మల్లాడి మూర్తి, మౌలాలి, మురళీ, వైఎస్‌ నాగేశ్వరరావు, సునీత పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో టీడీపీ సీనియర్‌ నాయకుడు బొల్లా చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌ చేసి కొవ్వలి నాయుడుకు తినిపించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ కొవ్వలి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. నాయకులు కత్తిమండ ముత్యాలరావు, పాలా రాంబాబు, డొల్లా రత్నంరాజు, ముక్కు పుల్లయ్య నాయుడు, దేశంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో పుంగనూరు దూడ జననం



మొగల్తూరు, ఆగస్టు 26 : మొగల్తూరులోని పెద్ద రైస్‌మిల్లు యజమాని అనంతపల్లి ఫణికి చెందిన ఒంగోలు జాతి ఆవుకు కృష్ణాష్టమి రోజున పుంగనూరు దూడ పుట్టింది. మిల్లు యజమానికి గల ఒంగోలు ఆవు పుంగనూరు దూడకు జన్మనివ్వడంతో స్థానికులు తిలకించారు.